RNI No: APTEL/2018/76747



# నవతరం

DYNAMIC EDITION తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | ఆదివారం | సంపుటి: 9 | సంచిక: 243 | పేజీలు: 04 | వెల: 5 /- | 20 సెప్టెంబర్ 2026 |

## ఏకదంతా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..
# అన్నదాన కార్యక్రమం

**కుత్బుల్లాపూర్, నవతరం:** గాజులరామారం సర్కిల్ మహదేవపురం డివిజన్ దేవేందర్ నగర్ పోచమ్మ బస్తిలోని 'ఏకదంతా యూత్ అసోసియేషన్' ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహాదారులు, ప్రముఖ కవి గాయకులు దరువు అంజన్న, జగద్గిరిగుట్ట ఎస్సై అప్పారావు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు సతల గోపాల్, దేవేందర్ జేఏసీ అధ్యక్షులు పిట్ల మల్లేష్, పోచమ్మ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పటేల్ గారి గోపాల్ గౌడ్, విగ్రహ దాత జెల్ల శివ లు పాల్గొని గణనాతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆ గణనాతుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషంగా జీవించాలని వేడుకున్నారు. తదనంతరం అతిథులందరిని ఏకాందంత యూత్ అసోసియేషన్ ప్రతినిధి సుగ్రీవుడు ముదిరాజ్ మరియు వారి బృందం ఘనంగా సన్మానించారు.



ఈ కార్యక్రమంలో అడ్వకేట్ శివానంద్, రామాలయం టెంపుల్ ఛైర్మన్ బండారి శ్రీధర్ ముదిరాజ్, సీనియర్ నాయకురాలు హనీఫా, స్థానిక నాయకులు భాస్కర్, సుంకరి శివకుమార్, సీనియర్ జర్నలిస్టులు సరస్వతి నరేంద్ర రాజ, బాన్సువాడ వెంకటేష్, డాక్టర్ ఎల్లంపల్లి నర్సింలు, గణేష్ నరేష్ ఎర్రం శ్రీనివాస్ గుప్తా, శ్రీరామరాజు, సాయి రాజ్, పాండురంగం, నీరుడు శివ, యూత్ అసోసియేషన్ సభ్యులు గుర్రం శేఖర్ రెడ్డి, సింహాద్రి, వెంకట్ రెడ్డి, దత్తు, దాసు జానుపుల మల్లేష్, భరత్, చందూ, అభి, విద్యా, చౌడప్ప, ఉల్లాస్ రెడ్డి, ఉదయ్ రెడ్డి, జీవన్, అనిల్, సాయి నవదీప్, ధనుష్, సాయి, యశ్వంత్ రెడ్డి, లడ్డు, శివ, వంశీ, అలేఖ్య, సాయి ప్రసన్న, శృతి, శ్రీజ, తదితరులు పాల్గొన్నారు.









# మంత్రి పదవి పోయిందన్న బాధ లేదు, కానీ..

- తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నానన్న ప్రచారాన్ని కొట్టిపారేసిన కొండా సురేఖ
- మంత్రి పదవి పోయినందుకు బాధ లేదు, కానీ కారణం చెప్పకపోవడమే ఆవేదన కలిగించింది
- భవిష్యత్తులోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని స్పష్టం చేసిన కొండా దంపతులు
- స్థానిక నేతలపై పరోక్షంగా విమర్శలు గుప్పించిన మాజీ మంత్రి
- త్వరలో తన భర్త కొండా మురళికి పదవి వస్తుందన్న సంకేతాలు ఉన్నాయని వెల్లడి

**హైదరాబాద్, నవతరం:** తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్టుగా కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ ఫుల్ స్టాప్ పెట్టారు. ఆ వార్తలన్నీ నిరాధారమైనవని, కేవలం కల్పిత కథనాలని ఆమె కొట్టిపారేశారు. తన భర్త కొండా మురళితో కలిసి ఆదివారం వరంగల్‌లో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "మేము కాంగ్రెస్‌లోనే పుట్టాం, కాంగ్రెస్‌లోనే పెరిగాం. మాకు వేరే పార్టీలోకి వెళ్లాలనే ఆలోచన లేదు" అని కొండా సురేఖ తేల్చిచెప్పారు. గతంలో కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. తమను ఎవరూ బయటకు పంపలేదని గుర్తుచేశారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మంత్రివర్గం నుంచి తనను తొలగించడంపై మాట్లాడుతూ.. పదవి పోయినందుకు వ్యక్తిగతంగా ఎలాంటి బాధ లేదని, కానీ ఎందుకు తొలగించారో కారణం చెప్పకపోవడం ఆవేదన కలిగించిందని అన్నారు. మంత్రి పదవి ఒక అలంకారం మాత్రమేనని, తనకు అప్పగించిన మూడు శాఖలను ఎలాంటి అవినీతికి తావులేకుండా నడిపించానని తెలిపారు.

పార్టీ మార్పు ప్రచారం నేపథ్యంలో అధిష్ఠానం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, తాను పార్టీ వీడటం లేదని వారికి స్పష్టం చేశానని సురేఖ వెల్లడించారు. ఈ క్రమంలో తన భర్త కొండా మురళికి త్వరలో పదవి ఇస్తామనే సంకేతాలు కూడా అధిష్ఠానం నుంచి వచ్చాయని ఆమె తెలిపారు. రానున్న ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున మళ్లీ గెలిచి, మంత్రిగా తిరిగి వస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 24 నుంచి 25 డివిజన్లలో కాంగ్రెస్‌ను గెలిపించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలపై ఆమె పరోక్షంగా విమర్శలు గుప్పించారు. కనీసం కార్పొరేటర్‌గా కూడా గెలవలేని వారు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్ మరణం తర్వాత స్థానికంగా ఉన్న కొందరు "గుంటనక్కలు" తమను మోసం చేశారని ఆరోపించారు. అప్పటి మంత్రిని ఓడించేందుకే కేసీఆర్ తనకు వరంగల్ తూర్పు టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. తాము పరకాలను వీడిన తర్వాత చల్లా ధర్మారెడ్డి అక్రమంగా డబ్బు సంపాదించారని కూడా సురేఖ ఆరోపణలు చేశారు.



# పిడుగుపాటుతో నలుగురు మృతి

- **పల్నాడు జిల్లాలో పిడుగుపాటుకు నలుగురు మృతి**
- **మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతి**
- **ఉరుముల శబ్దానికి ఇద్దరు, పిడుగుపాటుకు మరో ఇద్దరు మృతి**
- **పండుగపూట విషాదం జరగడంపై ముఖ్యమంత్రి తీవ్ర ఆవేదన**

**పల్నాడు, నవతరం:** జిల్లాలో పిడుగుపాటుకు గురై నలుగురు వ్యక్తులు మరణించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పండుగపూట నాలుగు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొనడం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, వారిని ఆదుకుంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

**అసలేం జరిగింది?**

పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. ఈ ప్రకృతి బీభత్సంలో పిడుగులు పడి వేర్వేరు గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**మృతుల వివరాలు..**

నరసరావుపేట మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన తలపనేని నాగమ్మ (63) ఇంటి సమీపంలోని కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. ఆ తీవ్రమైన శబ్దానికి భయపడి గుండెపోటుకు గురైన ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. అదేవిధంగా, కాకాని శివారు లక్ష్మీపురం గ్రామానికి చెందిన మేకల వెంకాయమ్మ (60) కూడా తన ఇంటి వద్ద పిడుగు పడిన భారీ శబ్దానికి గుండె ఆగి మరణించారు. మరో రెండు ఘటనల్లో, పాలపాడు గ్రామానికి చెందిన రైతు డేరంగుల వెంకటయ్య, యాకలవారిపాలెంకు చెందిన మరో రైతు మజ్జిగ చిన్న కోటేశ్వరరావు పిడుగుపాటుకు నేరుగా గురై ప్రాణాలు విడిచారు. పొలాల్లో పనుల్లో ఉన్న సమయంలో ఈ దుర్ఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ పిడుగుల కారణంగా రెండు వేర్వేరు గ్రామాల్లో మూడు ఆటోలు, పలు కొబ్బరి, మామిడి చెట్లు కూడా దెబ్బతిన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు.

# ప్రకృతి సౌందర్యం .. అరకులోయ

**అల్లూరి సీతారామరాజు జిల్లా, నవతరం:** అరకులోయ ప్రకృతి సౌందర్యానికి పేరుగాంచింది. శీతాకాలంలో వలిసపూలు పూసి కొండలన్నీ పసుపు వర్ణంతో మరింత అందంగా తయారవుతాయి. అరకు చేరే మార్గంలో ఇరువైపులా దట్టమైన ఆడవులు ఉండే ఘాట్ రోడ్, ఆసక్తికరముగా ఆహ్లాదకరముగా ఉంటుంది. విశాఖపట్నం నుండి రోడ్డు, రైలు మార్గాలు రెండూ ఉన్నాయి. ఈశాన్య రైల్వే లైను కొత్తవలస - కిరండూల్లో అరకు, అరకు లోయ రెండు స్టేషన్లు ఉన్నాయి. రైలు ప్రయాణంలో "సిమిలిగుడ" అనే స్టేషను భారతదేశంలో అతి ఎత్తులో వున్న బ్రాడ్గేజ్ స్టేషను. బొర్రా గుహలు చూడటానికి ఇక్కడ దిగాలి. అరకులో వుండటానికి అన్ని తరగతుల వారికి సరిపడ వసతి గృహాలు ఉన్నాయి. దారిలో అనంతగిరి కొండలలో కాఫీ తోటలు ఉన్నాయి. అరకు నుండి 29 కి.మీ. దూరములో ఉన్న బొర్రా గుహలు ఒక పర్యాటక ఆకర్షణ. ట్రైబల్ మ్యూజియమ్ ఇంకొక ఆకర్షణ. గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు రెండు, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఒకటి, ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల ఒకటి ఉన్నాయి. సమీప బాలబడి అరకులోయలో ఉంది.సమీప జూనియర్ కళాశాల అరకులోయలోను, ప్రభుత్వ ఆర్ట్స్ / సైన్స్ డిగ్రీ కళాశాల పాడేరులోనూ ఉన్నాయి. సమీప వైద్య కళాశాల, మేనేజిమెంటు కళాశాల విశాఖపట్నంలోను, పాలీటెక్నిక్ పాడేరులోనూ ఉన్నాయి. సమీప వృత్తి విద్యా శిక్షణ పాఠశాల అరకులోయలోను, అనియత విద్యా కేంద్రం, దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలు విశాఖపట్నంలోనూ ఉన్నాయి.



# ఈ వారంలోనే కేటాయింపు పత్రాలు

- ఇందిరమ్మ టవర్స్ LIG ఇళ్ల లబ్ధిదారులకు
- 6,660 మంది అభ్యర్థుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి
- బ్రోకర్లు, మధ్యవర్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దు: వి.పి. గౌతమ్

హైదరాబాద్, నవతరం: ఇందిరమ్మ టవర్స్ LIG గృహాల లక్కీ డ్రాలో ఎంపికైన అభ్యర్థుల్లో ఇప్పటివరకు 6,660 మంది అభ్యర్థుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిందని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ మరియు హౌసింగ్ కమిషనర్ శ్రీ వి.పి. గౌతమ్, ఐఏఎస్ తెలిపారు. మిగిలిన అభ్యర్థుల క్షేత్రస్థాయి పరిశీలనను కూడా ఈ వారంలోనే పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులుగా నిర్ధారించబడిన లబ్ధిదారులకు ఈ వారంలోనే అధికారిక కేటాయింపు పత్రాలు (Allotment Letters) జారీ చేస్తామని తెలిపారు. లక్కీ డ్రాలో ఎంపికైన అభ్యర్థులు తమకు ఇల్లు కేటాయించబడుతుందా లేదా అనే ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలన మరియు అర్హత నిర్ధారణ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను ఆసరాగా చేసుకుని కొందరు బ్రోకర్లు, మధ్యవర్తులు ఇల్లు మంజూరు చేయిస్తామని లేదా అధికారులతో మాట్లాడి సహాయం చేస్తామని చెబుతూ అమాయక లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. "గృహాల కేటాయింపు ప్రక్రియలో బ్రోకర్లు, మధ్యవర్తులు లేదా ఇతర వ్యక్తులకు ఎలాంటి పాత్ర లేదు. లబ్ధిదారులు ఎవరికీ లంచం, కమిషన్ లేదా ఇతర రూపంలో డబ్బులు చెల్లించవద్దు. గృహాల కేటాయింపు పూర్తిగా ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశించిన అర్హతలు మరియు అధికారిక ప్రక్రియ ఆధారంగానే జరుగుతుంది" అని శ్రీ వి.పి. గౌతమ్ స్పష్టం చేశారు. గృహానికి సంబంధించిన మొదటి విడత మొత్తాన్ని చెల్లించాల్సిన అధికారిక బ్యాంకు ఖాతా వివరాలు, చెల్లించాల్సిన మొత్తం, చెల్లింపు గడువు మరియు ఇతర సూచనలను కేటాయింపు పత్రంతోపాటు అధికారికంగా తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు. కేటాయింపు పత్రంలో పేర్కొన్న అధికారిక బ్యాంకు ఖాతాకు మాత్రమే నిర్ణీత మొత్తాన్ని చెల్లించాలని సూచించారు. ఇతర వ్యక్తులు తెలిపే ఖాతాలకు లేదా వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు జమ చేయవద్దని హెచ్చరించారు. ఇల్లు మంజూరు చేయిస్తామని ఎవరైనా డబ్బులు అడిగినా లేదా అనధికారిక ఖాతాలకు చెల్లించాలని కోరినా వెంటనే తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారులు గృహాల కేటాయింపు, క్షేత్రస్థాయి పరిశీలన, కేటాయింపు పత్రాలు, మొదటి విడత చెల్లింపు తదితర అధికారిక సమాచారం కోసం తెలంగాణ హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్ www.tghb.telangana.gov.in ను సందర్శించవచ్చు లేదా కాల్ సెంటర్ నంబరు 040-24603572ను సంప్రదించవచ్చు. తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారికంగా జారీ చేసే ప్రకటనలు, కేటాయింపు పత్రాలు మరియు సంబంధిత అధికారుల సూచనలను మాత్రమే విశ్వసించాలని వైస్ ఛైర్మన్ మరియు హౌసింగ్ కమిషనర్ లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో లోక్ అదాలత్ సక్సెస్

## సైబర్ బాధితులకు రూ.42 కోట్ల వాపసు

హైదరాబాద్, నవతరం: తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించిన మూడో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 3,896 సైబర్ మోసాల కేసులతో సహా మొత్తం 1.51 లక్షలకు పైగా రాజీపడదగిన (కాంపౌండబుల్) క్రిమినల్ కేసులను పరిష్కరించినట్లు తెలంగాణ పోలీస్ శాఖ ఆదివారం వెల్లడించింది. ఈ సెటిల్‌మెంట్ల ద్వారా సైబర్ నేరాల బాధితులకు ఏకంగా రూ.42.29 కోట్లు తిరిగి అందజేయడం గమనార్హం.

రాష్ట్రవ్యాప్తంగా కోర్టులలో కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, కక్షిదారుల సమయం, డబ్బు ఆదా చేసే లక్ష్యంతో ఈ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇరు పక్షాల మధ్య రాజీ, పరస్పర అంగీకారం ద్వారా వివిధ రకాల కేసులను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. ఈ అవకాశాన్ని ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు ప్రోత్సహించారు. ఇందుకోసం పరిష్కారానికి అర్హత ఉన్న కేసులను గుర్తించి, ఇరువర్గాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు.



డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సెప్టెంబర్ 3న ప్రారంభమైన కేసుల పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 12న ముగిసింది. ఈ సమయంలో మొత్తం 1,51,164 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 21,843 ఎఫ్ఐఆర్ కేసులు, 1,404 విపత్తు నిర్వహణ కేసులు, 61,052 పెట్టీ కేసులు, 62,969 మోటార్ వాహన చట్టం కేసులు ఉన్నాయి. ప్రత్యేకించి, 3,896 సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం ద్వారా బాధితులకు రూ.42.29 కోట్ల మొత్తాన్ని తిరిగి చెల్లించారు.

కేసుల పరిష్కారంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ యూనిట్లలో హైదరాబాద్ (15,944 కేసులు), ఖమ్మం (10,955 కేసులు), గద్వాల (8,469 కేసులు), వరంగల్ (8,404 కేసులు), మల్కాజ్‌గిరి (8,109 కేసులు) ముందున్నాయి.

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (TGLSA), జిల్లా జడ్జిలు, మేజిస్ట్రేట్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు (DLSA), పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీల సమిష్టి కృషితో ఇంత పెద్ద సంఖ్యలో కేసులను పరిష్కరించడం సాధ్యమైందని డీజీపీ తెలిపారు. ఈ సమన్వయంతో కూడిన ప్రయత్నం వల్ల లోక్ అదాలత్ గొప్ప విజయాన్ని సాధించిందని ఆయన పేర్కొన్నారు.

# తెలంగాణ ధనిక రాష్ట్రం.. అది రోశయ్య చలవే

హైదరాబాద్, నవతరం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.16,000 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఆవిర్భవించిందంటే, ఆ ఘనత పూర్తిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రోశయ్య ముందుచూపు వల్లే 2014 జూన్ 2న తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఏర్పడిందని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇచ్చిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెన్నారెడ్డి, విజయభాస్కర రెడ్డి, వై.ఎస్. రాజశేఖర రెడ్డి వంటి ముఖ్యమంత్రులు రాష్ట్ర ఖజానా బాధ్యతలను ఆర్యవైశ్యులకే అప్పగించారని తెలిపారు. రోశయ్య అత్యధిక కాలం ఆర్థిక మంత్రిగా పనిచేసి, 16 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనతను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. తాను శాసనమండలిలో దూకుడుగా మాట్లాడినప్పుడు, రోశయ్య తనను పక్కకు పిలిచి కోపాన్ని తగ్గించుకుని అనుభవంతో ముందుకు వెళ్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటావని సలహా ఇచ్చారని వెల్లడించారు. రోశయ్య ఎప్పుడూ కఠినంగా విమర్శించలేదని, తన చతురత, వాగ్ధాటితోనే పదునైన వ్యాఖ్యలు చేసేవారని అన్నారు.

హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటును కొందరు విమర్శించారని, కానీ నాలుగు దశాబ్దాల క్రితమే హైదరాబాద్‌కు వచ్చి, కష్టసుఖాల్లో ఇక్కడే ఉంటానని చెప్పిన ఆయన మాటకు గౌరవమిచ్చి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి వివరించారు. ఆర్యవైశ్యులు సామ్యులని, ఆత్మగౌరవం, ముందుచూపు, విజ్ఞత వారి డీఎన్ఏలోనే ఉన్నాయని సీఎం ప్రశంసించారు. ఎంతోమంది పేదరికంలో ఉన్నా, ఆత్మగౌరవానికి విలువిచ్చి తమను పేదవారిగా చెప్పుకోవడానికి ఇష్టపడరని అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వంటి మహనీయులు ఆర్యవైశ్య వర్గానికి చెందినవారేనని గుర్తుచేశారు. ఆర్యవైశ్యులకు దక్కాల్సినంత గుర్తింపు రాలేదని పేర్కొన్న సీఎం, ఈ ఆత్మగౌరవ భవనం పేద ఆర్యవైశ్యుల అవసరాలు తీర్చాలని ఆకాంక్షించారు. భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.



# ఆర్టీసీ బస్సులో మహిళల కొట్లాట

హైదరాబాద్, నవతరం: మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పరిగి నుంచి హైదరాబాద్ వెళుతున్న టీజీఎస్ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం కొందరు మహిళలు తీవ్రంగా కొట్టుకున్నారు. ఒకరి జుట్టు మరొకరు పట్టుకుని, పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ఉచిత ప్రయాణ పథకం వల్ల బస్సుల్లో పెరిగిన రద్దీ, తలెత్తుతున్న వివాదాలపై మళ్లీ చర్చ మొదలైంది. వివరాల్లోకి వెళితే, వికారాబాద్ జిల్లా పరిగి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న బస్సులో ఈ గొడవ జరిగింది. వినాయక చవితి పండుగ నేపథ్యంలో బస్సు ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో సీటు విషయంలో నలుగురు మహిళల మధ్య వాగ్వాదం మొదలై, అది తీవ్ర ఘర్షణకు దారితీసింది. తోటి ప్రయాణికులు వారిని విడదీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ గొడవతో ఇబ్బందిపడిన కొందరు ప్రయాణికులు బస్సు దిగి వెళ్లిపోయినట్లు సమాచారం.

తెలంగాణలో 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. అయితే, పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో తరచూ ఇలాంటి గొడవలు జరుగుతున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. ఒక మంచి పథకాన్ని ఇలాంటి ఘటనలతో అపహాస్యం చేస్తున్నారని సోషల్ మీడియాలో పలువురు కామెంట్లు పెడుతున్నారు.



# రెండున్నర రోజుల్లో 15 మంది దేశాధినేతలతో భేటీ

పొలిటికల్ బ్యూరో, నవతరం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దౌత్యపరంగా తనదైన శైలిని, అలుపెరగని శక్తిని మరోసారి ప్రదర్శించారు. ఢిల్లీలోని భారత్ మండపం వేదికగా విజయవంతంగా ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు, ఆయన నిబద్ధతకు అద్దం పట్టింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు కేవలం రెండున్నర రోజుల వ్యవధిలో, ప్రధాని మోదీ ఏకంగా 15 దేశాధినేతలు, ప్రభుత్వ అధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించి తన దౌత్య వేగాన్ని చాటుకున్నారు. ఈ అధికారిక సమావేశాలే కాకుండా, బ్రిక్స్ సదస్సు సెషన్లు, ఔట్‌రీచ్ సమావేశాల మధ్యలో పలువురు ప్రపంచ నేతలు, అంతర్జాతీయ సంస్థల అధిపతులతో కూడా ఆయన అనేక పుల్-అసైడ్ (అనధికారిక) సమావేశాల్లో పాల్గొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో చర్చలతో ప్రధాని మోదీ ఈ దౌత్య మారథాన్‌ను ప్రారంభించారు. అదే రోజు సాయంత్రం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్‌లతో వేర్వేరుగా భేటీ అయ్యారు.

శనివారం ఉదయం హైదరాబాద్ హౌస్‌లో ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్ అలీతో చర్చలతో రోజును ప్రారంభించిన మోదీ, ఆ తర్వాత మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మహమ్మద్, వియత్నాం ప్రధాని లే మిన్ హంగ్‌లతో వరుసగా సమావేశమయ్యారు. అనంతరం బ్రిక్స్ సదస్సులో పాల్గొని, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో కీలక ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. సదస్సులో భాగంగా 'భారత్ ఇన్నోవేట్స్' ఎగ్జిబిషన్‌ను తిలకించడం, నేతలతో కలిసి మొక్కలు నాటడం వంటి కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఆదివారం కూడా ప్రధాని సమావేశాల పరంపర ఆగలేదు. బ్రిక్స్ భాగస్వామ్య, ఔట్‌రీచ్ దేశాల నేతలతో భేటీ అనంతరం, కజకిస్తాన్ ప్రధాని, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు, ఈజిప్ట్ అధ్యక్షుడు, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు, బురుండి అధ్యక్షుడు, నైజీరియా ఉపాధ్యక్షుడు, ఉగాండా ఉపాధ్యక్షురాలితో ఒకరి తర్వాత ఒకరితో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. మొత్తం మీద, బ్రిక్స్ సదస్సు వేదికగా ప్రధాని మోదీ చూపిన చొరవ, ఆయన జరిపిన వరుస సమావేశాలు ప్రపంచ దేశాలతో సంబంధాలను బలోపేతం చేయాలన్న భారత్ సంకల్పాన్ని మరోసారి స్పష్టం చేశాయి.



# ఆపరేషన్ అరణ్యలో తీవ్ర ఉద్రిక్తత..

## స్మగ్లర్ల దాడిలో ముగ్గురు అటవీ సిబ్బందికి గాయాలు.. పవన్ ఆగ్రహం

**ఆంధ్రప్రదేశ్, నవతరం:** అన్నమయ్య జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లు మరోసారి రెచ్చిపోయారు. తమను అడ్డుకునేందుకు ప్రయత్నించిన అటవీ శాఖ అధికారులపై వాహనంతో దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు అటవీ శాఖ సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం రొంపిచర్ల మండలం బొమ్మయ్యగారిపల్లి సమీపంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో అటవీ శాఖ సిబ్బంది 'ఆపరేషన్ అరణ్య' చేపట్టారు. ఇందులో భాగంగా స్మగ్లర్ల వాహనాన్ని అడ్డుకునేందుకు తమ పెట్రోలింగ్ వాహనాన్ని రోడ్డుకు అడ్డంగా నిలిపారు. అయితే, అక్కడికి వేగంగా దూసుకొచ్చిన స్మగ్లర్లు ఆగకుండా, అధికారుల వాహనాన్ని బలంగా ఢీకొట్టి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో అటవీ శాఖ వాహనంతో పాటు స్మగ్లర్ల వాహనం కూడా దెబ్బతింది. ఈ దాడిలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె. ప్రకాశ్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు పి. రెడ్డి ప్రసాద్, కె. ప్రతాప్‌లతో పాటు వాహన డ్రైవర్ చరణ్‌కు గాయాలయ్యాయి. అయినప్పటికీ, అటవీ సిబ్బంది ప్రాణాలకు తెగించి ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. స్మగ్లర్లలో ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన సిబ్బందిని మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఎస్వీఆర్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ఘటనా స్థలం నుంచి ఎర్రచందనం దుంగలు, ఒక తూకం యంత్రం, రంపం, గొడ్డళ్లు, స్మగ్లింగ్‌కు ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు స్మగ్లర్లు పరారీలో ఉన్నట్లు గుర్తించారు.

### ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్

అటవీ సిబ్బందిపై జరిగిన దాడి ఘటనపై ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ప్రాణాలకు తెగించి స్మగ్లర్లను పట్టుకున్న అధికారుల ధైర్యాన్ని ఆయన అభినందించారు. గాయపడిన సిబ్బందికి మెరుగైన వైద్యం అందించాలని, చికిత్స ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. సిబ్బంది పూర్తిగా కోలుకునే వరకు పీసీసీఎఫ్ పర్యవేక్షించాలని ఆదేశించారు. అటవీ సంపదను దోచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ సిబ్బందిపై దాడులకు పాల్పడే వారిపై అత్యంత కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ నేరాలను అరికట్టడంలో తమ కూటమి ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని ఆయన పునరుద్ఘాటించారు. పరారీలో ఉన్న మిగతా ముగ్గురు నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, స్మగ్లింగ్ ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్ ఫోర్స్ అధికారులను ఆదేశించారు.



# ఏపీ టెట్-2026 ఫలితాలు విడుదల

**అమరావతి, నవతరం:** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు శుభవార్త. ఏపీ టెట్-2026 జూన్ కు సంబంధించిన ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం విడుదల చేశారు. ఈ పరీక్షలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు 51 శాతం ఉత్తీర్ణత సాధించగా, సాధారణ అభ్యర్థులు 47 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ.. టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులందరికీ, ముఖ్యంగా ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. "ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు తమ అకడమిక్ నైపుణ్యాన్ని, నిబద్ధతను మరోసారి నిరూపించుకున్నారు. మీ కృషి, అంకితభావం ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయి" అని ఆయన ప్రశంసించారు. అదే సమయంలో, ఈసారి అర్హత సాధించలేకపోయిన అభ్యర్థులు నిరాశ చెందవద్దని లోకేశ్ భరోసా ఇచ్చారు. "విజయం అనేది ఒక గమ్యం కాదు, అదొక ప్రయాణం. కాబట్టి పట్టుదలతో ప్రయత్నిస్తూనే ఉండండి" అని వారికి ధైర్యం చెప్పారు. లక్ష్యసాధన కోసం కృషి కొనసాగించాలని సూచించారు. టెట్ ఫలితాలను అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ aptet.apcfss.in ద్వారా తెలుసుకోవచ్చు. దీంతో పాటు, అభ్యర్థుల సౌలభ్యం కోసం 9552300009 అనే వాట్సాప్ నంబర్ ద్వారా కూడా ఫలితాలను పొందే సదుపాయాన్ని కల్పించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసి ఫలితాలను సులభంగా చూసుకోవచ్చు. ఉపాధ్యాయ నియామకాలకు టెట్ అర్హత తప్పనిసరి కావడంతో ఈ ఫలితాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది.



# డీఎస్సీపై బురద చల్లొద్దు

**అమరావతి, నవతరం:** రాష్ట్రంలో మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని, ఎంపికైన అభ్యర్థులే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమని ఆయన అన్నారు. డీఎస్సీ నియామకాలపై బురదజల్లడం ద్వారా మాజీ ముఖ్యమంత్రి జగన్ తన దిగజారుడు రాజకీయాలను బయటపెట్టుకుంటున్నారని ఆయన విమర్శించారు. విశాఖపట్నంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగం పొందిన ఒక అభ్యర్థిని స్వయంగా కలిసి, ఎంపిక ప్రక్రియ ఎలా జరిగిందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాతపరీక్ష నుంచి కౌన్సెలింగ్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వరకు ప్రతి దశలోనూ ప్రభుత్వం పారదర్శకత పాటించిందని, ఎక్కడా ఎలాంటి ఇబ్బంది ఎదురవలేదని ఆ అభ్యర్థి తనకు వివరించినట్లు పల్లా తెలిపారు. అభ్యర్థులే వాస్తవాలు చెబుతున్నా, గొడ్డలి పార్టీ నేతలు అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

### వంద శాతం పారదర్శకంగా నియామకాలు

కూటమి ప్రభుత్వం 16,000 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను వంద శాతం పారదర్శకంగా, కేవలం మెరిట్ ప్రాతిపదికనే చేపట్టిందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. క్రీడా కోటాలో సైతం అభ్యర్థుల అర్హతలను, వారు సమర్పించిన ధ్రువపత్రాలను నిపుణులతో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఈ ప్రక్రియలో ఎక్కడైనా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న వారు, అందుకు సంబంధించిన ఆధారాలతో సహా ఫిర్యాదు చేయాలని ఆయన సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

### దొంగే దొంగ అన్నట్లు వైసీపీ తీరు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డీఎస్సీ నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసి, ఏపీపీఎస్సీలో అక్రమాలకు పాల్పడిన వారు ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని పల్లా ఎద్దేవా చేశారు. "వైసీపీ పాలనలో జరిగిన అవకతవకలు ఒక్కొక్కటిగా బయటకు వస్తాయనే భయంతోనే జగన్ రెడ్డి, ప్రజల దృష్టిని మళ్లించడానికి డీఎస్సీపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. వారి తీరు దొంగే దొంగ అని అరిచినట్లుగా ఉంది" అని పల్లా విమర్శించారు. అభ్యర్థులు ఏళ్ల తరబడి కష్టపడి చదివి సాధించుకున్న ఉద్యోగాలను రాజకీయ వివాదాల్లోకి లాగడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని పల్లా తెలిపారు. మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో నియామక ప్రక్రియలు వేగవంతమయ్యాయని, అర్హులైన యువతకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. యువత భవిష్యత్తుతో ఆడుకునే రాజకీయాలు మానుకోవాలని జగన్ రెడ్డికి హితవు పలికారు. గొడ్డలి పార్టీ ఎన్ని కుట్రలు పన్నినా, వాస్తవాలను దాచలేరని, వారి దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.



# జగన్ మరోసారి ఫైర్..

**ఆంధ్ర ప్రదేశ్, నవతరం:** టీడీపీ ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ స్కాం జరిగిందంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపిస్తుండడం తెలిసిందే. దీనిపై ఆయన సోషల్ మీడియా వేదికగా మరోసారి ధ్వజమెత్తారు. ఓ అభ్యర్థి విషయంలో జరిగింది సరైన, పారదర్శక విధానమేనా? అని ముఖ్యమంత్రి చంద్రబాబును నిలదీశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. జగన్ తన పోస్టులో పేర్కొన్న వివరాల ప్రకారం, ఒక అభ్యర్థికి 65 టెట్ మార్కులతో, ఏడు దశల వెరిఫికేషన్ తర్వాత ఉద్యోగం కేటాయించారు. అయితే, ఆ తర్వాత అదే అభ్యర్థి అనర్హుడని డీఈవో నిర్ధారించారని తెలిపారు. అలాంటప్పుడు ఆ ఏడు దశల వెరిఫికేషన్‌లో ఏం జరిగిందని ప్రశ్నించారు. తనకు ఉద్యోగం ఎలా వచ్చిందో తెలియదని అభ్యర్థే చెప్పిన విషయాన్ని కూడా జగన్ ప్రస్తావించారు. విమర్శలు వెల్లువెత్తిన తర్వాత, ఆ అభ్యర్థికి 2018 టెట్‌లో 77 మార్కులు వచ్చాయని అధికారులు చెప్పడంపై జగన్ సందేహాలు లేవనెత్తారు. ఆ మార్కులు ముందే ఉంటే, డీఈవో ఎందుకు అనర్హుడని ప్రకటించారని ప్రశ్నించారు. అంతేకాకుండా, ఆ 77 మార్కులు ఎస్‌జీటీ పోస్టుకు అవసరమైన పేపర్-I-Aకు బదులుగా, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పేపర్-II-Bలో వచ్చాయని, అయినా ఎలా అర్హత కల్పించారని నిలదీశారు. 2018 టెట్ స్కోర్‌తోనే ఉద్యోగానికి అర్హత ఉంటే, ఆ అభ్యర్థి 2025లో మళ్లీ టెట్ ఎందుకు రాశారని జగన్ ప్రశ్నించారు. ఇన్ని మలుపుల తర్వాత ఈ నియామక ప్రక్రియను పారదర్శకంగా జరిగిందని చెప్పగలరా? అని అన్నారు. ఇది డీఎస్సీ స్కామ్‌ను ప్రోత్సహించడం కాదా? అని ప్రశ్నిస్తూ, దీనికి చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని జగన్ డిమాండ్ చేశారు.



# తిరుమలకు రోజుకు 15,000 వాహనాలేనా?

**తిరుమల, నవతరం:** బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల ప్రైవేట్ వాహనాలపై ఆంక్షలు విధిస్తున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తీవ్రంగా ఖండించింది. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని, భక్తులు ఇలాంటి నిరాధారమైన వదంతులను నమ్మవద్దని స్పష్టం చేసింది. కొంతకాలంగా సోషల్ మీడియా వేదికగా, "తిరుమలకు రోజుకు కేవలం 15,000 ప్రైవేట్ వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఆ సంఖ్య దాటిన తర్వాత వచ్చే వాహనాలను అలిపిరి చెక్‌పాయింట్ వద్దే నిలిపివేస్తారు" అంటూ వార్తలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ ప్రచారం భక్తుల్లో తీవ్ర గందరగోళానికి, ఆందోళనకు కారణమైంది. ఈ నేపథ్యంలో టీటీడీ స్పందిస్తూ ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది. తిరుమలకు వచ్చే ప్రైవేట్ వాహనాల సంఖ్యపై ఎలాంటి పరిమితులు విధించే నిర్ణయం తీసుకోలేదని తేల్చిచెప్పింది. ప్రస్తుతం వాహనాల రాకపోకలపై ఎటువంటి కొత్త ఆంక్షలు అమలులో లేవని పునరుద్ఘాటించింది. టీటీడీకి సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలను, అధికారిక సమాచారాన్ని కేవలం టీటీడీ అధికారిక వెబ్‌సైట్, శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ (SVBC) ద్వారా మాత్రమే వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. వాస్తవాలు నిర్ధారించుకోకుండా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి భక్తులను అయోమయానికి గురిచేయడం సరికాదని హితవు పలికారు. టీటీడీ పేరుతో ఇలాంటి అసత్య ప్రచారాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ‘శ్రీ సత్యసాయి అవతారం’ షూటింగ్లో.. నవోదయ పాఠశాల విద్యార్థులు

**జగద్గిరిగుట్ట, నవతరం:** చదువుతో పాటు అదనపు కార్యకలాపాలు అవసరమేనన్నారు నవోదయ పాఠశాల ఫౌండర్ కాసర్ల గిరి. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలనే ఉద్దేశ్యంతో జగద్గిరిగుట్టలోని నవోదయ పాఠశాల వ్యవస్థాపకులు కాసర్ల గిరి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 6వ తరగతి నుంచి 9 వరకున్న విద్యార్థులకు శనివారం నాడు రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతున్న ‘శ్రీ సత్యసా యి అవతారం’ సినిమా షూటింగ్లో అవకాశం కల్పించేలా ప్రోత్సహించారు. సదరు సినిమా షూటింగ్లో పాల్గొనే అవకాశం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు సైతం పాఠశాల యాజమాన్యం తీసుకున్న చొరవపై ప్రశంసలు కురిపించారు. డిజిటల్ యుగంలో పుస్తకాలు, కంప్యూటర్ లతో కుస్తీ పడుతున్న విద్యార్థులకు ఇలాంటి యాక్టివిటీస్ వల్ల కొత్తదనంతో పాటు విలువలతో కూడిన విద్యనందించినవారవుతారని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు ‘థియరీ తో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్’ సొంతమవుతుందని సంతోషం వ్యక్తం చేశారు. నవోదయ పాఠశాల యాజమాన్యపు చొరవను పలువురు అభినందిస్తున్నారు.












# అనుబంధాలతో ‘ఆత్మహత్య’లు ఆపగలం!

సృష్టిలోని సమస్త ప్రాణుల్లో ఉన్నతమైంది, అపురూపమైంది మానవజన్మ. తెలివితేటలు, ఆలోచనాశక్తి, గ్రాహ్యశక్తి సృష్టిలోని జీవులన్నింటిలోకి గొప్పగా ఉన్నది ఒక్క మనిషికే. నిజానికి మానవజన్మ నిస్సందేహంగా ఓ వరంలాంటిది. సంపూర్ణమైంది. అందుకే నిండునూరేళ్ళు వర్ధిల్లమని మన పెద్దలు పిన్నవయస్కులను ఆశీర్వదిస్తుంటారు. ఆయుష్షు ఉన్నంతవరకు హాయిగా జీవితాన్ని గడపడమనేది మన చేతుల్లోనే ఉంది. అయినాకూడా మనం ఏం చేస్తున్నాం? ఆలోచనాశక్తిని, వివేకాన్ని వదిలేసి మన చేతులతోనే మన ఆయుష్షును అర్థంతరంగా ముగించేస్తున్నాం. చిన్నాచితక సమస్యలకే కుంగిపోయి ఆత్మహత్యే శరణ్యమనుకుంటున్నాం. కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్నాం. తోబుట్టువులకు, మిత్రులకు తీరని శోకాన్ని ఇస్తున్నాం. ఎందరికో బతికున్నంతకాలం తీరని వ్యధను తోడుగా ఇస్తున్నాం. కుటుంబ సభ్యులతోనో, మిత్రులతోనో, అన్యులతోనో తలెత్తిన చిన్నపాటి గొడవలను చిలువలు పలవలుగా ఊహించుకుని తనువుచాలిస్తున్నవారి సంఖ్య తక్కువేంలేదు. మంచి మార్కులు తెచ్చుకోలేకపోయానని, ఆశించిన సీటు దక్కించుకోలేకపోయానని, పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక, చేయనితప్పుకు మీదపడిన నిందారోపణలు మోయలేక మానసికంగా ఒంటరై...ఇలా సమస్యేదైనా ఆత్మహత్యే శరణ్యం అనుకుంటున్నారు ఎంతోమంది. ఈ బలవణ్మరణాల సంఖ్య ఏటేటా పెరుగుతూపోతున్నాయి. ప్రతిఏటా సుమారు 8లక్షల మంది అంటే ప్రతి 40సెకన్లకు ఒకరు స్వయంగా తమ ఆయుష్షును అర్థంతరంగా ముగిస్తున్నారంటే సమస్య తీవ్రతను అర్థంచేసుకోవచ్చు. ఇక ఆత్మహత్య ఆలోచనలు సుడిగాలిలా చుట్టుముట్టినా చివరి క్షణంలో మనసుమార్చుకుని బతికిబట్టకడుతున్నవారి సంఖ్యా చాలా పెద్దదే. అంటే ఒకరు బలణ్మరణం చెందితే మరో 20మందిదాకా ఆ ప్రయత్నాలనుంచి బయటపడగలుగుతున్నారు. వీరిలో కొంతమంది ఆత్మహత్య ఆలోచనలవద్దే ఆగిపోతుంటే, కొందరు ఆత్మహత్యాయత్నాలుచేసి మరణం అంచులను చూసివస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్న చేదునిజాలివి. నిజానికి ఇవి మనం మన చుట్టుపక్కల చూడనివేం కాదు.

**సమస్య అంత ఝటిలమైందా?**

ఎంతపెద్ద కొండైనా అద్దంముందు చిన్నదైపోతుందట. కుటుంబ కలహాలు, పరీక్షల ఒత్తిళ్ళు, మానసిక సమస్యలు, సవాళ్లు, డబ్బులేకపోవడం...ఇలా సమస్య ఏదైనా ఓపికతో, నేర్పుతో ఎదిరించి కలబడి నిలబడాలేగాని చావే శరణ్యం అనుకుంటే, అర్థంతరంగా తనువు చాలించడమే పరిష్కారమనుకుంటే ఈ భూమ్మీద బతికి ఉండేదెవరు? ఈ బలవన్మరణాలను ఎలాగైనా నిరోధించాలనే తపనతోనే ప్రతిఏటా సెప్టెంబరు 10వతేదీ ప్రపంచవ్యాప్తంగా దాదాపుగా అన్నిదేశాలు ‘ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం’గా జరుపుతున్నాయి. మన సమస్యలకు ఆత్మహత్యలు ఏమాత్రం పరిష్కారం కాదనే నిజాన్ని విశ్వవ్యాప్తం చేయాలనేది ఈ ఆత్మహత్యల నివారణ దినోత్సవం లక్ష్యం. “ఆత్మహత్యపై దృక్పథాన్ని మార్చుదాం” అనే ఇతివృత్తంతోపాటు, “మౌనంవీడి మాట్లాడదాం”అనే కార్యాచరణకు పిలుపునిస్తోంది ఈ ఏడాది అంటే 2026 సంవత్సరంలో జరుపుకోబోతున్న ఆత్మహత్యల నివారణ దినోత్సవం. వరుసగా వందేళ్ళుగా ఇదే ఇతివృత్తాన్ని కొనసాగిస్తున్నారు. ఆత్మహత్యలపట్ల ప్రజల మనసుల్లో నాటుకుపోయిన అపోహలను తొలగించడం, ఆత్మహత్యలపై వివక్షతోకూడిన సామాజిక భావనను పోగొట్టి, ఆత్మహత్యల గురించి జంకుగొంకులేకుండా బహిరంగంగానే మాట్లాడగలిగే వాతావరణాన్ని తీసుకురావడం మనందరి బాధ్యత అని తెలియచెప్పడంకోసమే ఈ ఇతివృత్తాన్ని ఎంచుకున్నారు. 2003లో మొదటిసారిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచఓ) కోస్పాన్సరర్‌గా అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ సంఘం(ఐఎఎస్‌పి) ఈ ‘ఆత్మహత్యల నివారణ దినోత్సవం’ జరపడం ప్రారంభించింది. అలాగే సెప్టెంబర్ రెండో గురువారంనాడు ‘ఆర్ యు ఓకే’ దినోత్సవాన్ని జరుపుతున్నారు. కుటుంబం, మిత్రులు, ఇరుగుపొరుగువారి యోగ క్షేమాలు కనుక్కొని వారిలోని ఒత్తిడిని దూరంచేయడంకోసం జరుపుతున్న దినోత్సవం ఇది. ఆస్ట్రేలియాలో ఎక్కువగా జరుగుతున్న ఆత్మహత్యలను చూసి చలించిపోయిన ‘గావిన్ లర్కిన’ అనే వ్యక్తి ఇందుకు శ్రీకారం చుట్టారు. మనస్సుకు దగ్గరైనవారు చెప్పే ఓదార్పుమాటల ప్రభావం అంతాఇంతాకాదు. దేన్నైనా రివర్స్ చేయగల సత్తా ‘అనుబంధాలకే’ ఉంటుంది. ఈ బాటను విస్తృతం చేయడానికే ‘ఈ ఆర్ యు ఓకే’ పలకరింత.

మన భారతదేశం ఎంతో ప్రాచీనమైంది. వేల సంవత్సరాల ఘన చరిత్ర ఉంది. సంస్కృతీసంప్రదాయాలపరంగానూ సుసంపన్నమైంది. మునులందించిన తరగని శాస్త్రవిజ్ఞానం మన సొంతం. ఏ దేశంలోనూ లేనివిధంగా తల్లీ, తండ్రీ, గురువులను దైవంగా భావించే సంస్కృతి మన సొంతం. వసుధైక కుటుంబాలు కాకపోయినా ఇప్పటికీ కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉన్న దేశం మన భారతదేశం. ప్రతిఒక్కరికీ ‘నా’అనేవారు ఉన్న దేశం. ఈ ఆధునిక యుగంలోనూ మానవ సంబంధాలు పటిష్టంగానే ఉన్న మన దేశంలోనూ బలవన్మరణాలు భారీ సంఖ్యలోనే ఉంటున్నాయి. ఇది నిజంగా ఆశ్చర్యం కలిగించే విషయం. ఇరుగుపొరుగువారితో బంధుమిత్రులతో పోలికలు, అన్నింటా మనదే పైచేయికావాలనే దురాశ ఇందుకు కారణం. అన్నింటా మన పిల్లలే ముందుండాలనే మనస్తత్వంగల తల్లిదండ్రుల ఒత్తిడిని, తమ కాలేజీకే గొప్పర్యాంకులు రావాలనే కార్పొరేట్ విద్యాసంస్థల యావకు ఎంతోమంది విద్యార్థులు బలవుతున్నారు. నిత్యం ఎదురయ్యే ఒత్తిడిని చిత్తుచేయలేక ఉరితాడుకు వేలాడుతున్నారు. ఒక కోచింగ్ సెంటర్ తమ ఫ్యాన్లంటికీ ఐరన్‌జాలీలను అడ్డంపెట్టిన వైనం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఇది విద్యార్థుల్లోని ఒత్తిడికి అద్దంపడుతోంది. దీర్ఘకాలిక అనారోగ్యాలు, ఒంటరితనం, ఆర్థికచిక్కుముళ్ళు, ప్రేమ విఫలమైనప్పుడు, వైవాహిక జీవితంలో ఒడిదుడుకులు వచ్చినప్పుడు, వ్యాపారంలో నష్టాలు ఎదురైనప్పుడు ‘ఎందుకు ఈ జీవితం?’ అనుకుంటూ ఆత్మహత్య ఆలోచనలు చేస్తున్నవారి సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. తొందరపాటుతో చేజేతులా నిలువునా ప్రాణాలు తీసుకుంటున్నవారి గురించే అందరం ఆలోచించాలి. ఒక వ్యక్తి బలవన్మరణానికి ఒడిగడితే అతనితో పెనవేసుకుని ఉన్న ఎన్నో ప్రాణాలు విలవిల్లాడిపోతాయి. గుర్తొచ్చినప్పుడెల్లా మనసు వికలమవడమేగాకుండా సమాజం నుంచి ఎదురయ్యే ఆరాలు, అవహేళనలు, జాలిని కుమ్మరించే ఓదార్పులు జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయి. ఓ కుటుంబ పెద్ద బలవన్మరణం చెందితే అతనిపై ఆధారపడిన మొత్తం కుటుంబం యావత్తు కకావికలమైపోతుంది. పొట్టచేతపట్టుకుని రోడ్డున పడాల్సిన దుస్థితి దాపురిస్తుంది. ఇలాంటి కథనాలు కోకొల్లలు.

**మీడియా ప్రభావం...**

మీడియా ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలు కూడా కుంగుబాటులో ఉన్నవారిపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తున్నాయనడంలో సందేహంలేదు. ‘ఆత్మహత్య చేసుకోవడం ఎలా’ అనేది ఇంటర్నెట్‌లో సెర్చ్‌చేసి ప్రాణాలు తీసుకుంటున్నవారు ఉన్నారు. తమ ఆత్మహత్యను సోషల్‌మీడియాలో లైవ్‌కవరేజ్ ఇస్తున్నారు. ఆత్మహత్య చేసుకోబోయే విషయాన్ని ముందుగానే చర్చకు పెడుతున్నారు. కొన్ని బలవన్మరణాలను మీడియా పదేపదే చూపించడంవల్ల బలహీనమనస్కులపై ప్రతికూలప్రభావం పడుతోంది. ఆత్మహత్యకు ఒడిగడుతున్నవారిలో చదుకోని వారికంటే చదువుకున్నవారే ఎక్కువ. 80శాతందాకా ఉన్నారు. సమాజంలోని ప్రతివర్గం సంపన్నులు `బీదవారు, చదువరులు` చదువుకోనివారు, వివాహితులు`ఒంటరివారు ఇలా అన్ని వర్గాలవారు, అన్ని వయస్సులవారు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. అప్పులపాలై ఎన్నో కుటుంబాలు ఆత్మహత్యలను ఆశ్రయిస్తున్నాయి. అత్తింటివారి ఆరళ్ళువల్లో, భర్త దుర్వసనాల కారణంగానో పిల్లలనూ తమతోపాటు పైలోకాలకి తీసుకెళుతున్న మధ్యతరగతి మహిళలు ఎంతమందో. అందుకే “ఆత్మహత్యల తాలూకు బాధలను అనుభవించిన ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీలు, పరిశోధకులు, వైద్యులు, రాజకీయ నాయకులు, విధాన రూపకర్తలు, సామాజిక కార్యకర్తలు ప్రతిఒక్కరు కూడా నిశ్శబ్దాన్ని వీడి ఆత్మహత్యలకు దారితీస్తున్న ప్రజల మానసిక ప్రవర్తనపై దృష్టి సారించాలి”అని ఆత్మహత్యల నివారణ దినోత్సవం గుర్తుచేస్తోంది.

**“కష్టసుఖాలు కావడి కుండలోయ్..**
**కావడి కొయ్యేనోయ్.. కుండలు మన్నేనోయ్”**

అన్నారు ఓ కవి. బహుశ కష్టసుఖాలు రెండూ మనం చేతుల్లోనే ఉంటాయని చెప్పడమే ఇక్కడ కవి ఉద్దేశం. ఒడిదుడుకుల్లేని జీవితాన్ని మనం ఊహించలేం. వాటిని తట్టుకుని నిలబడితేనే జీవితం. కష్టాలే మనిషిని ఆలోచింపచేస్తాయి. ఆలోచనలే మనిషికి జ్ఞానాన్నిస్తాయి. జ్ఞానం జీవితంలో ఒడిదుడుకులను ఎదుర్కొనే శక్తినిస్తుంది. ఒక మనిషి ఎప్పుడూ కష్టాల్లోనే కొట్టుమిట్టాడడం, సుఖాల్లోనే తేలిపోవడం అనేది మనం ఎక్కడా కనం, వినం. కష్టసుఖాలు ఎప్పుడూ జంట కవలలే. మన జీవితంతోపాటు మన చుట్టుపక్కల ఉన్నవారి జీవితాలను నిశితంగా గమనిస్తే ఈ విషయం ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. అప్పుడు ఆత్మహత్యల ఆలోచనలు తోకముడుస్తాయి. మనలోని ఒత్తిడిని దూరంచేయగల సత్తా అనుబంధాలు, ఆత్మీయతలకు కచ్చితంగా ఉంది. వీటిని మరింత భద్రంగా చూసుకున్నవారు హాయిగా సంపూర్ణ జీవితాన్ని గడపొచ్చు. ఈ దిశలో అడుగులు పడిననాడు ఈ ఆత్మహత్యల నివారణ దినోత్సవానికి అర్థం, పరమార్థం చేకూరుతుంది.

వ్యాసకర్త:
**సరోజిని బోళ్ళ**
**సీనియర్ జర్నలిస్ట్**

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism (NiMA), Ph.D(Hons) in Mass Communication & Journalism - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India.